సంపుటి: 11
సంచిక : 2
మే: 2011

222

పేజీలు : 100
వెల :
₹ 25/-

ముఖచిత్రం : తథాగతుడు :: ముఖచిత్రం : బాలి

చిరునామా : 1-9-286/2/P; "యడ్లపాటివారి ఇల్లు"; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర); హైదరాబాద్ - 500 044.
ఫోన్ : (అ): 040 - 2707 1500 :: (ఇ): 040 - 2707 7599
*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com ; www.rachana.net*

సంపాదకీయం..... 5

## కథలు

'జ్యోతి' బహుమతి కథ :
అన్నన్నా...! - చుండూరి సీత 22
పెద్దకథ :: పెరుగు - 'కేసరి' 37
పెద్దకథ :: సుపారి - ఎలక్ట్రాన్ 50
నో....ఫార్మాలిటీస్ - పమ్మి శేష శ్రీనివాస్ 66
ఋణశేషం - ద్వివేదుల సోమనాధశాస్త్రి 70
భూదేవమ్మ - మంచికంటి 74
హంసగీతం - ఎం.సుగుణారావు 80

## శీర్షికలు

పజిలింగ్ పజిల్ - 222 నిర్వహణ : సుధామ 8
సాహితీ వైద్యం - వసుంధర 59
అమృతవర్షిణి - డా.కె.వి.రమణ 90

## సీరియల్ రచనలు

కుజుడి కోసం - డాక్టర్ చిత్తర్వు మధు 12
అనగనగా ఒక ఈగ ఇల్లలుకుతూ....... - వాసిరెడ్డి నారాయణరావు 29
పిల్లకోతి కిచకిచలు - వై. శేషతల్పశాయి 83
ఆకాశవాణిలో నా అనుభవాలు - డి. వెంకట్రామయ్య 92
అమెరి'కాకమ్మ'కబుర్లు - వంగూరి చిట్టెన్ రాజు 95

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు

వచ్చే సంచికలో .....

పెద్దకథ :: **నిష్కామ కర్మ** : జంధ్యాల మాలతి

The Views, Opinions expressed and Statements made by the Writers, Authors and Readers need not necessarily be those of the Editor and Management of Rachana Entinti Patrika.
All disputes will come under the exclusive jurisdiction of respective Courts and Forums situated in Hyderabad City only.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా



**మార్కెటింగ్**

**పచిపాల మార్కెటింగ్**
3-6-136/6, స్ట్రీట్ నెం. 17
హిమయత్‌నగర్,
హైదరాబాద్-29
ఫోన్ : 040 - 40077558
మొబైల్ : 9848630702

***సంపాదకుడు***

**వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి**

***అసోసియేట్ ఎడిటర్***

'హంసలేఖ'

***The Only Magazine Administered by Writers***

రచయిత కథ రాసి ప్రచురణకు పత్రికకు పంపిన తర్వాత అదెంత త్వరగా ప్రచురింపబడుతుందా అని ఆతృత పడడం సహజం! పత్రికల వాళ్లకి నెలకి కొన్ని పదుల కథలు అందుతుంటాయి. వాటి ఎంపిక ఒక కసరత్తు! ఏ పుట్టలో ఏ పామున్నదో చందాన ఏ కథలో ఏ మెరుపులున్నాయో తెలుసుకుందుకి ప్రతి కథనూ కూలంకషంగా చదివి తీరాలి. ఓ మంచి కథ దొరికించుకోవడానికి కొన్ని పదుల సాధారణ కథలను చదివే ఓర్పు, సహనం ఉండాలి – తప్పదు! ఎంపిక చేయడానికి పూనుకున్న వారికి ఇది ఒక రకంగా ప్రయాసే! మరొకరకంగా శిక్ష కూడానూ!

ఆ మీదట ఎంపికయిన కథలను ముందుగా పంక్చుయేషన్, పేరా డివిజన్, అక్షరదోషాలు సవరించడం లాంటివి చేయాలి. తర్వాత కంపోజ్ చేయించడం, ముద్రారాక్షసాలను ఒకటికి రెండుసార్లు సరిదిద్దడం – ఆ సరిదిద్దిన తప్పులు సరిచేయబడ్డాయా లేదాని మరొకసారి సరిచూడ్డం, వాటికి కాపీలు తీసి చిత్రకారులకు పంపి బొమ్మలు వేయించడం – యిలా అనేకానేక అంచెలుంటాయి, ప్రచురణకు ముందు. ఇందుకు అయ్యే ఖర్చు, ప్రతి కథకీ, కొన్ని వందల్లో ఉంటుంది కూడా!

మామూలుగా అందే కథలు కాక పోటీల్లో ఎంపికచేయబడ్డ కథలు చాలానే ఉంటుంటాయి. వాటికీ మళ్లీ అన్ని అంచెలూ ఉంటాయి ప్రచురణకు సిద్ధం కావడానికి. ఇవన్నీ అయిన తర్వాత ఒక సంచికలో ప్రచురించడానికి కథలను బైటికి తీసినప్పుడు పేజీల సంఖ్య, చిత్రకారుడు, కథావస్తువు, ఆ నెల సందర్భం లాంటి విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి యాదృచ్ఛికంగా ఒక సంచికలోని కథలన్నీ వృద్ధులకు సంబంధించినవే రావడంతో 'ఈసారి కథలన్నీ ముసలి వాసన వేస్తున్నాయి' అనే విమర్శను స్వీకరించాల్సి వచ్చింది. న్యాయనిర్ణేతలు ఒక క్రమ పద్ధతిలో కథలను ఎంపిక చేసినప్పుడు, ఆ క్రమాన్నే ప్రచురణలో పాటించడంలో కలిగిన ఇబ్బంది అది. అలానే, ఈ సంచికలో ప్రచురించిన నాలుగు కథలూ, వరుస క్రమంలో, ఒక పోటీలో, సాధారణ ప్రచురణకు ఎంకైనవి. ఈ నాలుగు కథల్లోనూ 'చావు' ప్రధాన అంశం! అయినా సహ రచయితల ఎరుక కోసం ప్రచురిండం జరిగింది. ఇలా ఒకేరకమైన కథాంశం కలిగిన కథలు ఒకే సంచికలో రావడం హర్షణీయం కాదుగదా! ఆ కారణంగానే ఇకమీదట 'ఎంపికైన వరుస క్రమంలో ప్రచురణ' అన్న విధానాన్ని పాటించదల్చుకోలేదు. అలాగే 'కాకి పిల్ల కాకికి ముద్దు' అన్నట్లు కొందరు 'కథ పంపి మూడు నెలలయింది – సంవత్సరం అయింది – ఎప్పుడు ప్రచురిస్తారు?' అని నెల నెలా ఒత్తిడి తెస్తుండడం మాకు అనుభవం. మరికొందరు కథల ప్రచురణ కోసం కొందరు ప్రముఖ రచయితల ద్వారా ఒత్తిడి తేవడం కూడా మా అనుభవంలోకి వచ్చింది. కథలో సత్తా ఉండాలేగాని ఏ సంపాదకుడూ మంచి కథను వదులుకోడు. ఇదేమాట పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు తరచూ చెబుతుండేవారు.

'పీత కష్టాలు పీతవి' అన్నట్లు మా ఇబ్బందులు మా కుంటాయి. అంచేత ఒత్తిళ్లు పెట్టవద్దని మనవి! ఆ కారణంగానే ఈసారి 'కౌముది-రచన' కథల పోటీ ఫలితాలు ప్రకటిస్తూ చివర్లో ఒక ముఖ్యమైన విషయాన్ని తెలియజెప్పడం జరిగింది. ఇలా చెప్పాల్సి రావడం అయిష్టమే అయినా ఒత్తిళ్లను భరించలేని స్థితి కలగడంతో చెప్పక తప్పలేదు మరి!

శాయి

**222**

**ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!**

# ఉత్తరం రచన



తెలుగు సాహితీవనంలో అనేక పుష్పాలు పూసాయి. అవి తమ తమ సహజ ప్రవృత్తులతో తమ సౌరభాలను వెదజల్లి తెలుగు వారిని పరవశింపచేసాయి. కానీ ఒక చెట్టు – దానిపేరు తెలుగు తల్లి. ఆ చెట్టు కొమ్మకు రెండు సౌగంధికా పుష్పాలు పూసాయి. ఆ రెండూ విడదీయరాని బంధంగా ఏర్పడి ప్రకృతి రమణీయతనంతా తమలో ఇముడ్చుకుని తమ అందం, పరిమళం, సహజ సౌందర్యంతో, అద్భుతమైన సోయగాలతో తమదైన స్వంత బాణీలో స్నేహానికి, నిజాయితీకి స్వచ్ఛమైన చిరునామాలా నిలిచి తెలుగు ప్రజల హృదయాలను ఆనందడోలలూగింపచేసాయి.

వాటి పేర్లే బాపు, రమణ.

ప్రస్తుత ప్రపంచపు అలజడుల హోరులో ప్రశాంతతనిచ్చే అనేక అపూర్వ కళాఖండాలను సృష్టించిన ఘనత ఖచ్చితంగా వారిద్దరిదే! వారు సృష్టించిన ప్రతీదీ ఎన్నో ఏళ్ళ వరకూ ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. అది ఆస్వాదించి అందుకునేవారి అదృష్టం మీద కూడా ఆధారపడి ఉంటుంది.

బాపు, రమణలు సృష్టించిన ఆణిముత్యాలే లేకపోతే జీవితంలో 'అదర్ సైడ్ ఆఫ్ ద కాయిన్' అసలు తెలియకపోను.

సహజమైన సౌందర్యం, స్వచ్ఛమైన తేనె, లేత కొబ్బరి ముక్కలు, తాటిముంజల రుచి, అద్భుతమైన 'టాలెంట్'ను అతి నిరాడంబరంగా చూపించగలగడం, ఆ ఇంటెలిజన్స్, ఆ రొమాన్స్, ఆ భక్తి, రక్తి – ఆ నీతి, నిజాయితీ గలగలపారే సెలయేరుల గలగలలు, అదే విధంగా గంభీర గోదావరి పారే తీరు – ఇవన్నీ ఎంతో అద్భుతంగా తెలుగు ప్రజల కళ్ళకు కట్టినట్లుగా చూపించిన ధన్యజీవులు శ్రీరామచంద్రుని దూతలు.

ఈ నిరంతర జీవిత చక్రపరిభ్రమణంలో మహానుభావులైన బాపు, రమణల జీవితకాలంలోనే మనం కూడా జీవించి ఉండడం మనందరి అదృష్టం. వారు పండించిన ఫలాలను డైరెక్ట్‌గా అందుకుని తరించాము.

కానీ జంటలో ఒక సౌగంధిక పుష్పం అలిసి, సొలసి, వాడి, ఊడి పడిపోయింది. జత పుష్పం బాధ తీర్చలేము. ఆ ఒంటరి పూవుకు మరో అటువంటి జతనే ఏర్పికూర్చలేము.

జీవితాంతం తెలుగు ప్రజలంతా బాధపడే దురదృష్టకర సంఘటన ముళ్ళపూడి మరణం. కానీ ఆయన పూయించిన పూలు మాత్రం నిత్యమూ సౌరభాలను వెదజల్లుతునే ఉంటాయి.

తెలుగు సాహితీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న 'రచన' నా అభిమాన పత్రిక. నా భావాలను వెంటనే 'రచన'తోనే పంచుకోవాలనే ఉద్దేశంతో....

– *వై. ఉషాకిరణ్ (కాకినాడ)*

ఫిబ్రవరి నెల 'రచన'లో ఉప్పునూతల నరసింహారెడ్డిగారు వ్రాసిన 'ముని' కథ చాలా బాగుంది. వారి శైలి, కథనం ఆద్యంతమూ చదివించేవిగా వున్నాయి. అనుబంధాలకూ, ఆప్యాయతలకూ, కులమతాలతో సంబంధం లేదని తెలియపరిచారు. కాని, అమెరికాలో దశాబ్దాలున్నా 'ముని'కి ఏది అంటువ్యాధో అవగాహన లేక తన తండ్రిని వేరే వుంచటం – పైగా అక్కడే వదలి వచ్చేయటం – పాఠకులకు చెడు సందేశాన్నిచ్చేదిగా వుంది.

– *అద్దంకి వెంకటేశ్వరరావు (నవీ ముంబయ్)*

ముళ్లపూడి వెంకటరమణగారి మరణానికి ఆంధ్రదేశంలో ఆయన్ని తెల్సినవాళ్లు, ఆయన రచనల్ని చదివినవారు ఒక్కసారి విషాదానికి గురికాక మానరు. మార్చి 'రచన' ముఖచిత్రం చూడగానే మనసు భారమైంది. సంపాదకీయం చూడగానే మైండ్ బ్లాకవుట్ అయింది. నిజంగానే రమణగారు అమరావతిలో బిజీగా వుండివుంటారు.

ఏ చిన్న ఆడపిల్లని చూసినా 'సీగానపెసునాంబ' అనీ, చిన్నవాడ్ని 'బుడుగు' అనీ పిలవడం నాకు అలవాటు. ఇలా బుడుగులు, గానపెసూనాంబలు, లావుపాటి పిన్నిగార్లు, రాధలు, గోపాలాలు – ఇలా అందరూ మన చుట్టూ కనపడుతూ కలియ తిరుగుతుంటే మరి రమణగారు చిరంజీవే కదండీ! ఆ మహానుభావుడికి అంజలి ఘటించడం తప్ప ఏం చెయ్యగలం?

– *వేదుల పార్వతి (హైద్రాబాద్)*

మహనీయుల విశేష సంచికలతో, మంచి శీర్షికలతో 'రచన' చాలా ఆనందాన్ని కలిగిస్తోంది.

మన వారసత్వాన్ని తలుచు కున్నప్పుడల్లా మనలో ఒక నూత్న ఉత్తేజం, స్ఫూర్తి కలుగుతాయి. డి. వెంకట్రామయ్యగారి 'ఆకాశవాణి అనుభవాలు' ఎందరో మహనీయుల ఉదాత్త వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తోంది. గొల్లపూడి మారుతీరావు మున్నగు ప్రముఖ నటులను, రచయితలను సన్నిహితంగా చూపిస్తూ సందేశాత్మకంగా సాగుతోంది.

చిట్టెన్ రాజుగారి కామెడీ కథలు సున్నితమైన హాస్యంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

– *తుర్లపాటి రాజేశ్వరి (బెర్హంపూర్)*

❖

అపూర్వచిత్ర (సినీ నిర్మాణ సంస్థ) సహకారంతో 'కౌముది-రచన' మాసపత్రికలు నిర్వహించిన
కథల పోటీ - 2011 ఫలితాలు

**ప్రత్యేక బహుమతి (₹ 5000/-) పొందిన కథ**

## ఐక్యం :: - సిహెచ్.సీత *(హైదరాబాదు)*

*బహుమతి (ఒక్కొక్కటి ₹ 1500/-) పొందిన కథలు*

1. అముద్రిత కావ్యం
*- మూలా సుబ్రహ్మణ్యం (బెంగుళూరు)*

2. పరకాయం
*- కాకాని చక్రపాణి (హైదరాబాదు)*

3. నవ్వు - నవ్వించు
*- మంథా భానుమతి (హైదరాబాదు)*

4. ప్రేమలేఖ రాసా - నీకంది ఉంటదీ..
*- లత కందికొండ (హైదరాబాదు)*

5. కన్నీటికి దూరంగా... దుఃఖానికి దగ్గరగా...
*- వి.ఎస్.ఎస్. హేమ (బ్లూమింగ్టన్, యు.ఎస్)*

6. ఆదదరి
*- కె.వి.రమణారావు (హైదరాబాదు)*

7. లచ్చుమ్మ జడ
*- దీపిక ఉప్పులూరి (ఒహాయో,యు.ఎస్)*

8. అంతరంగం అట్టడుగున..
*- సిహెచ్.వి.బృందావనరావు (విజయవాడ)*

9. అహో ఆంధ్రభోజా
*- వసుంధర (హైదరాబాదు)*

10. ఆకాశంలో రెండు తారకలు
*- ఎమ్.సుగుణరావు (విశాఖపట్నం)*

11. శేషారత్నం
*- కర్లపాలెం హనుమంతరావు (హైదరాబాదు)*

12. మనోరథం
*- దర్భా లక్ష్మీ అన్నపూర్ణ (బెంగుళూరు)*

13. తీగలాగితే..
*- సింహగిరి (విశాఖపట్నం)*

14. ప్రహేళిక
*- కె.వరలక్ష్మి (జగ్గంపేట)*

15. నేనింతే
*- సౌమ్య నిట్టల (సికింద్రాబాదు)*

16. డబ్బుతో కొనలేనిది
*- మాధవ్ దుర్భా (అట్లాంటా, యు.ఎస్)*

17. అడుగడుగున గుడి ఉంది
*- పోలాప్రగడ జనార్దనరావు (జెన్ని) (హైదరాబాదు)*

18. గౌతమి
*- శివాని (బెంగుళూరు)*

19. అంతులేని పయనం
*- శిరంశెట్టి కాంతారావు (పాత పాల్వంచ)*

20. సుఖాంతం
*- పొత్తూరి విజయలక్ష్మి (హైదరాబాదు)*

### సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు

1. దిద్దుబా(ట్లు)టలు - డా.గరిమెళ్ళ నారాయణ (యు.ఎస్): 2. పగిడి - కె.బి.లక్ష్మి (హైదరాబాదు): 3. మంచాన పడితే పడ్డాను - డి.ఆర్.ఇంద్ర (రాజమండ్రి): 4. మరో మర్యాద రామన్న - విజయ కర్రా (యు.ఎస్): 5. అదృష్టం - పి.ఎస్.నారాయణ (హైదరాబాదు): 6. కాలచక్రం - అపర్ణ మునుకుట్ల గునుపూడి (యు.ఎస్): 7. మనసు చూడతరమా.. - జి.ఎస్.లక్ష్మి (హైదరాబాదు): 8. గుడ్‌బై మిస్టర్ సంపత్ - వై.రమేష్ బాబు (విశాఖపట్నం): 9. ప్రేమరాహిత్యం - ప్రవీణ కొల్లి (షార్జా):10. వాళ్ళు ముగ్గురూ.. - వెంపటి సుధాప్రసన్న (విశాఖపట్నం): 11. దీనాతి దీనార్ - మూలా రవికుమార్, టి.వి.కె.శ్రీనివాసరావు (మండపేట): 12. ఎక్కడైనా వెన్నెలే - అవసరాల రామకృష్ణారావు (విశాఖపట్నం): 13. కృష్ణలంక - పాలెపు బుచ్చిరాజు (బరోడా): 14. అమ్మా..నువ్వెప్పుడొస్తావు? - సీతాసత్య (మినుములూరు): 15. రాచకురుపు వారసత్వం - డా.జొన్నలగడ్డ మార్కండేయులు (హైదరాబాదు): 16. భ్రమ - వెల్చేరు చంద్రశేఖర్ (ఇథియోపియా): 17. మొదటి నేస్తం - సాగి వర్మరాజు (హైదరాబాదు): 18. విముక్తుడు - ఎన్. తారక రామారావు (హైదరాబాదు): 19. గోరంత పోరబాటు - కనకదుర్గ దంటు (హైదరాబాదు): 20. నమ్మకం పేరు - సుధీర్ వంకదార (జెర్సీసిటీ, యు.ఎస్): 21. నిర్మాతలు - ఎ.పుష్పాంజలి (మదనపల్లి):

22. మనీప్లాంట్ - డా.శ్రీమతి కొఠారి వాణీ చలపతిరావు (హైదరాబాదు).

విజేతలకు అభినందనలు! పోటీలో పాల్గొన్న సాహితీమిత్రులకు కృతజ్ఞతలు!

*ఈ కథలు 'కౌముది' (మాసపత్రిక)లో వరుసగానూ, 'రచన' (మాసపత్రిక)లో వీలునిబట్టీ ప్రచురింపబడతాయి. ప్రచురణ విషయంలో రచయితలు ఎలాంటి ఒత్తిడీ కలిగించడం తగదు. అలా జరిగిన సందర్భంలో ఆ కథల ప్రచురణ జరగదు.*

## యద్దనపూడి సులోచనారాణిగారి 'జ్యోతి బహుమతి' పొందిన కథ!

# అన్నన్నా!

"హలో"

"ఏమయ్యా! నీకేమైనా బుద్ధి ఉందా?"

అవతలివేపు నుండి మంత్రివర్యులు – ఏమంటాను? – 'యస్సర్' అని తప్ప.

"యస్సర్"

"నాలుగు రోజుల్నుండి మా కుక్కపిల్ల కనిపించడం లేదు. వెదుకుతున్నారా లేదా?"

"యస్సర్"

"అవతల మా ఆవిడ. కుక్కపిల్లని చూడకపోతే అరటిపండు తొక్క కూడా తిననంటోంది. ఏం చేస్తున్నారయ్యా మీరంతా?"

"వెదుకుతున్నాం సార్"

"ఎక్కడా? సహారా ఎడారిలోనా?"

"కాదు సార్. హైదరాబాదు సిటీలో"

"కుక్కకి హైదరాబాద్ హద్దులు తెలీవయ్యా! ఎక్కడో పడిపోయింది. పారిపోవడం దాని హక్కు. వెతికి పట్టుకోవడం మీ డ్యూటీ"

"యస్సర్"

"చూడవయ్యా! రేపటిలోగా కుక్కపిల్ల దొరకలేదనుకో – నీకు నల్లజర్ల అడవికి ట్రాన్స్‌ఫరూ, నాకు సన్యాసమూ తప్పవు. ఐనా ఓ కుక్కపిల్లని వెతికి పట్టుకోలేని మీరు దొంగల్నీ, హంతకులనీ ఎలా పట్టుకుంటారయ్యా?"

"హంతకులకీ దొంగలకీ మెదడుండదు సార్! అందుకని ఎలాగోలా పట్టుకోగలుగుతున్నాం. కాని మీ కుక్కగారు నిండా బుద్ధి శాలి. మేధావి కూడాను. అందుకే తను ఎక్కడికి వెళ్ళిందో తెలుసుకోలేకపోతున్నాం"

"థాంక్సయ్యా! ఈ రోజు మా కుక్క మేధస్సుని గురించి నువ్వు చెప్పిన మాటలు చెప్పి మా ఆవిడ చేత అన్నం తినిపిస్తాను. ఉంటాను. రేపు మీ పోలీసు స్టేషన్‌కి వస్తాను. కుక్కపిల్ల దొరికే వరకు అక్కడే ఉంటాను"

"సరే సర్! గుడ్‌డే సర్" ఫోన్ పెట్టేసి, "వెరీ బ్యాడ్‌డే నాకు" అన్నాను.

"సార్! మంత్రిగారి కుక్క నిజంగా మనకంటే తెలివైందా?" అడిగాడు కానిస్టేబుల్ కామేశం.

"ఔను! ఎందుకంటే దానికి నీలాంటి అసిస్టెంటు లేదుగదా?" అన్నాడు కోపంగా.

అతను నోరు మూశాడు.

అంతలో ఎవరో గుంపుగా వస్తూ కనిపించారు.

"ఆగండాగండి. పోలీస్ స్టేషన్లోకి ఇలా మందలు, మందలుగా రాకూడదు" అన్నాడు కానిస్టేబుల్ వాళ్ళకి ఎదురు వెళ్ళి.

అతన్ని ఓ పక్కకి నెట్టి అంతా లోపలికి వచ్చారు. అంతా నల్లగా ఉన్నారు. తెల్లని బట్టలు వేసుకున్నారు. నాలుగు వేళ్ళకి ఉంగరాలు. కుడి చేతికి బ్రేస్ లెట్టూ. చోటా మోటా రాజకీయ నాయకుల్లా ఉన్నారు.

'నేటి వీరే రేపటి వారు' అనుకున్నాను.

"కూర్చోండి" అన్నాను.

"అన్నా! నువ్వు గూసో" అన్నారంతా. అన్న కూర్చున్నాడు. తమ్ములంతా నిల్చున్నారు.

"చెప్పండి" అన్నాను.

"సార్! మేం ఏడుగురు అన్నదమ్ములం. ఆరుగుర్కి పెళ్ళైంది. ఐదుగుర్కి పిల్లలు పుట్టిరి. నల్గురికి ఉద్యోగం దొరికె. ముగ్గురు ఏపారం చేస్తున్నరు. ఇద్దరు ఇదేశాల్ల ఉన్నరు. ఒక్కన్కి పెళ్ళి కుదిరింది. పట్టుమనొచ్చిన సమ్మందం పుటుక్కుమన్నది"

**చుండూరి సీత**

## యద్దనపూడి సులోచనారాణి అందజేస్తున్న

## 'జ్యోతి బహుమతి' కథాపురస్కారం!

సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిగారు
ప్రతి సంవత్సరం ఒక వర్ధమాన రచయిత్రికి రు.1,116/-
'జ్యోతి బహుమతి' పేరిట కథాపురస్కారం ఇవ్వ సంకల్పించారు.
పురస్కారం పొందిన కథారచయిత్రి కథ శ్రీరామనవమి సంచికలో ప్రచురింపబడుతుంది.
మొదటిసారిగా ఈ పురస్కారం శ్రీమతి చుండూరు సీతగారికి లభించింది.
వీరు ఇదివరలో 'సిసీ', 'సిహెచ్. సీత' పేర్లతో కథలు రాశారు.

'జ్యోతి బహుమతి' పొందిన పురస్కారగ్రహీతకు రచనాభినందనలు!

"ఎందుకు?" గుంపుని ఆశ్చర్యంగా చూస్తూ అడిగాను.

"ఆడికి....అంటే మా తమ్ముణ్ని మెంటలొచ్చింది"

"అలా చెప్పండి. మీకు మెంటల్ హాస్పిటల్ నెంబరు కావాలా?" – కామేశం అడిగాడు.

"ష్!" అన్నాను.

"మావోణ్ని మెంటల్ రానీకి ఒకాయన్న కార్నం. ఆయ్ను మీద కేసు పెట్టాల"

"వివరాలు చెప్పండి"

"సార్! మీరు నాగరికంల మాట్లాడుతున్నరు. నాకది రాదు. అందుకే ఈ సార్‌ను లాక్కొచ్చిన. నువ్వు చెప్పు సార్" – ఒకతన్ని ముందుకు లాగాడు అన్న.

"ఇంతకీ ఎవరాయన?"

"ఓ సినిమా డైరెక్టర్ సార్"

"ఓ సారూ! గాసిన్మా కత చెప్పు"

"చెబుతున్నానండి. ఓ వ్యక్తికి మూడు రోజులుగా అన్నం దొరక్క వీధి కుళాయిలో నీళ్ళు తాగడానికి వెళతాడు. ఉన్నట్టుండి పంపు ఫోర్సుగా రావడంతో నీళ్ళు ముక్కులోకీ, గొంతులోకి అడ్డంపడి ఊపిరాడక చచ్చిపోతాడు. ఈ విషయం పాతికేళ్ళ తరువాత తల్లి ద్వారా వింటాడు హీరో.

హీరో చెత్తలోనుండి చిత్తు కవర్లు ఏరుకునేవాడు. ఓ కోటీశ్వరుడి కూతుర్ని ప్రేమిస్తాడు. ఆమె అసహ్యించుకుంటుంది.

కాని ఆమె స్నేహితురాలు పక్కనచేరి చెత్త ఎంత గొప్పదో, చెత్తేరుకునేవాడు ఎంత సంఘసంస్కర్తో చెబుతుంది. హీరోయిన్ 'చెత్త'తో ప్రేమలో పడుతుంది. 'చెత్తా! నా చిత్తూ' అని డ్రీంసాంగ్ పాడుకుంటుంది.

ఈలోగా హీరోగారు విమానం, ఓడ, రైలు, బస్సు, ఆటో, సైకిలు లాంటి వాహనాల మీద ప్రయాణం చేసి చేసి వచ్చి వీధి పంపుని డైనమెట్లు పెట్టి పేల్చేసి 'నాన్నా! నీ ఋణం తీర్చుకున్నాను' అంటాడు. ఇదీ కథ"

"ఇంతకీ ఈ సినిమాకి, మీవాడి పిచ్చికీ ఏంటి సంబంధం?"

"ఉంది సార్! మావోడు వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ల నల్లాల్లోకి నీళ్ళిడిచే ఉద్యోగంలో ఉన్నాడు మరి" అన్నాడు అన్న.

"సరే! ఇలాంటి పిచ్చి సినిమాలు తీయడం నేరమా కాదా అని మాపై వాళ్ళనడిగి మీకు కబురు చేస్తాను. ఎడ్రసిచ్చి వెళ్ళండి. ఇంతకీ మీపేరు?

"రాస్కో సార్! నా పేరు ఎంకటాచెలం, సెసాచెలం, గరుడాచెలం, సిమ్మాచెలం, నారాయ్నచెలం, అంగదాచెలం, కిందాడి పేరు రుసబాచెలం"

'ఎరక్కపోయినా అడిగానూ ఇరుక్కుపోయాను'

"వెంకటా చలంగారూ! కొంచెం నాగరికంలో మాట్లాడుకోవాలి. ఈ నాగరి'కథ'ని ఇక్కడే ఉంచి మీరు వెళ్ళండి. ఈయనే కదూ మిమ్మల్నిక్కడికి తీసుకొచ్చింది?"

"ఔను సార్! ఒస్తం. అన్నా! గీసారుతో మాట్లాడిరాయే. మేం బోతన్నం" – వెళ్ళిపోయారు.

"నాగరికంగారూ! కొంతకాలం సెల్లో తొంగోండి"

అతన్ని లాకప్‌లో తోసి, "జనాన్ని నా మీదకి తీసుకొస్తావా? అనుభవించు" అన్నా.

"ఏందన్నా! ఆళ్ళనిడిసి నిన్ను బొక్కల తోస్తరా?" అడిగారు సెల్లో ఉన్నవాళ్ళు.

"ఏమన్నా అనండిగానీ...ఈ ఇన్‌స్పెక్టర్ చాలా తెలివైన వాడ్రా

(మిగతా భాగం పత్రికలో చదవండి)

**సంక్రాంతి పెద్ద కథల పోటీలో రు.2500/- బహుమతి పొందిన కథ!**

# పెరుగు

ఒకటి కాదు....రెండు పెరుగు కప్పులు తన కంచం పక్క చూడగానే సజల నయనాలతో తలపైకెత్తి చూసేడు సత్యం.

సూరి కళ్ళంటా నీళ్లు తిరిగేయి. కళ్లు టపటప లాడించి వాటికి ఆనకట్ట వేయగలిగేడు. కానీ, ఆ ప్రయత్నంలో దీర్ఘంగా తీసి విడిచిన నిట్టూర్పుని ఆపలేకపోయేడు అతడు.

అదిమి పట్టిన ఏడుపు ఉబికి ఉబికి సత్యం నోటంట కళ్ళంట వచ్చేసింది. అతడి భుజం మీద చేయివేసి తడుతూ సూరి కూడా నిశ్శబ్దంగా కన్నీరు కార్చేడు.

"చాల్లేండి! అన్నదమ్ములు ఇద్దరూ ఇద్దరే! చూడండి! చిన్నపిల్లలు ఎలా బిక్కమొఖాలు వేసుకు చూస్తున్నారో! చూడండి" అన్న ఛాయ – సూరి భార్య – హెచ్చరికతో చుట్టూ చూసేరు అందరూ.

నిజమే....వాళ్ళ మనుమడు – శ్రీ....తొమ్మిదేళ్లవాడు – ఏ నిమిషాన్నైనా ఏడ్చేయటానికి సిద్ధపడిపోతున్నాడు.

అన్నదమ్ములు ఇద్దరూ కళ్లు తుడుచుకుంటూ, "ఒట్టినే!.... ఉత్తుత్తదే....సరదాగా....ఆట.... ఆటలో ఏడవటమన్న మాట" అంటూ తను నవ్వుతూ సత్యం చేసిన అభినయంకి శ్రీతో పాటు మిగిలిన ముగ్గురు చిన్నపిల్లలూ నవ్వు ముఖం పట్టేరు.

ఛాయ సైగను అర్థం చేసుకొని కొడుకు విస్సు – కోడలు దుర్గ....వాళ్ల పిల్లలు బేబి శ్రీలతోనూ, కూతురు అంబ – అల్లుడు బాలు....వాళ్ళ పిల్లలు బాబి బుజ్జీలతో హాల్లోకి వెళ్లిపోయేరు – అన్న దమ్ములిద్దర్నీ అయోమయంగా చూస్తూ.

ఈ పెరుగు వెనుక కథ సూరి పిల్లలకు తెలియదు. అదెప్పటి మాట – వాళ్లు అప్పటికి పుట్టలేదు – నాలుగు దశాబ్దాలపైమాట క్రితం కథ.

❖ ❖ ❖

వదినా మరుదుల్ని భోజనాల గదిలో వదిలేసి సూరి హాల్లోకి వచ్చేడు.

చిన్న పిల్లలు నలుగురూ మేడ మీది షాలియానా క్రిందికి పరుగు తీసేరు.

రేపు ఛాయకి అరవై ఒకటో పుట్టిన రోజు. మిగతా మరుదులు ఆడబడుచు – వాళ్ల కుటుంబాలు రాత్రికి దిగుతారు.

పెద్దవాళ్లు నలుగురు సూరి వేపు ఆసక్తిగా చూసేరు – విషయమేమైనా చెబుతారేమోనని.

వంటింటి వేపు ఒకసారి తొంగి చూసి గొంతు సవరించుకున్నాడు – అతను. నలుగురూ అతనికి దగ్గరగా జరిగేరు.

"పందొమ్మిది వందల అరవై ఎనిమిదిలో అనుకుంటాను, వీడు....మా ఇంట 'పెరుగు పితూరీ' లేవదీసేడు....

....చిన్నప్పట్నుంచీ వీడికి పెరుగంటే పిచ్చి ఇష్టం. పెరుగుకి వీడి జీవితంకి ఏదో ముడిపడి ఉందని మన ఇంట్లో ఓ నమ్మకం. ఆనాటికి వీడికి పధ్నాలుగేళ్లు అనుకుంటాను....

....మా నాన్నగారి సంతానం అందర్లోకి వీడే తెలివైనవాడు. మా అందరికన్నా ముందే మెరుగైన జీవితం ప్రారంభించినవాడు. వాడి ప్రగతికి చూసి గర్వించిన వాళ్ళం....

మాలో నలుగురం వాడికన్నా పెద్దవాళ్లం. మా కన్నా ముందే నిలకడైన ఉద్యోగం, మంచి జీతం, వాహన యోగం, స్వగృహ యోగం.

వాడు స్పర్థతో జీవితం సాగిస్తున్నాడు. అందుకే పురోగమిస్తున్నాడు అనుకున్నాం! కానీ తరువాత్తరువాత తెలిసింది...."

ఇంతలో ఛాయ, సత్యంలు వంటింటిలోంచి రావటం చూసి కథనం ఆపేసేడు సూరి.

సత్యం సరాసరి వచ్చి సూరి కూర్చున్న సోఫా దగ్గర నేలమీద చతికిలబడ్డాడు. సోఫాలో కూర్చున్న పిల్లలు ఇబ్బందిగా కదిలేరు.

ఫరవాలేదు కుర్చోండన్న సత్యం సైగతో స్థిమితంగా కూర్చున్నారు వాళ్ళు.

"అన్నయ్య....నా 'పెరుగు పితురీ' కథ చెబుతున్నాడా?" అన్నాడు అతను.

"కథలే మన అసలు సిసలైన చరిత్రలు. చరిత్ర మన పురోగతికి ఎంతైనా దోహదకారి" అంటూ...ఓ నిమిషం ఆగేడు సత్యం – తను చెప్పింది అవతలి వాళ్ళ బుర్రలోకి ఇంకడానికి అన్నట్లు.

"అన్నయ్య చెబుతున్నది నా చెవిన పడింది. 'ఫస్ట్ హేండ్ ఇన్ఫర్మేషన్' అనో, 'ఫ్రమ్ ది మౌత్ ఆఫ్ ది హార్స్ ఇట్‌సెల్ఫ్' అనో

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

**'కేసరి'**

# నో... ఫార్మాలిటీస్

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. నేను హడావుడిగా ఆటో దిగాను. రెండు చేతిసంచులు కూడా క్రిందకి దింపాను. జేబులో చెయ్యి పెడుతూ ఆటో మీటరుకేసి చూసాను. ముప్పై మూడు రూపాయలు అయ్యాయి.

"రెండు రూపాయల చిల్లర వుందా? ముప్పై అయిదు ఇస్తాను" – చెమట తుడుచుకుంటూ అడిగాను.

"అంటూ ముప్పైమూడే ఇస్తారా? నలభై ఇవ్వండి. లగేజి వుంది కదా" – బీడీ పొగ వదులుతూ అన్నాడు ఆటోవాలా.

'ఏంటి రెండు బ్యాగ్‌లు కూడా లగేజియేనా?'

"పెట్రోల్ రేటు కాలిపోతోంది తెలుసా? ముందే చెప్పివుంటే ఆటో ఎక్కనిచ్చేవాడ్ని కాదు."

"ఇంక మీటరు ఎందుకయ్యా?"–ఒకింత అసహనంగా అన్నాను.

"మీటరు పోలీసోడికి. బండి ఆపితే పది కొట్టాలి. నిన్ను, నీ లగేజిని రైల్వేస్టేషన్‌కి తీసుకొచ్చి మీటరు మీద అయిదు రూపాయిలు అడిగాను అంతేకదా" – చిరాకుగా అన్నాడు ఆటోవాలా.

"పోలీసోడికి పది రూపాయిలు ఎందుకు?" – అమాయకంగా మొహం పెట్టి అడిగాను.

"ఫార్మాలిటీస్. పోలీస్ ఫార్మాలిటీస్. ఇయ్యన్ని నీ కెందుకు? లగేజి ఫార్మాలిటీస్ ఇచ్చి లగేజి తీసుకెళ్ళు. లేకపోతే లగేజిని తీసుకు వెళ్ళనియ్యను" అంటూ ఆటోవాలా రాడ్ తీసాడు.

లేనిపోని గొడవ ఎందుకని, ఎక్కాల్సిన రైలుబండి లేటు అవుతుందని భయపడి నలభై ఇచ్చి, హమ్మయ్య అనుకొని స్టేషను లోపలికి వచ్చాను. టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌లో చూపిస్తే, ఇంకా కన్‌ఫర్మ్ అవ్వలేదని సీటు కూడా రాదని చెప్పారు.

ఇప్పుడు ఈ విజయవాడ నుంచి ఆ బెంగుళూరు ఎలాగ వెళ్ళాలి? పదహారు గంటల రైలు ప్రయాణం. రాత్రి నిద్రలేకపోతే రేపు మౌఖిక పరీక్షను ఎలా ఎదుర్కోగలను? ఈ ఆలోచనలతో తడిసిపోతుంటే, జాలి చూపించి ప్రక్కన ఉన్నవాళ్ళు 'కరెంటు రిజర్వేషన్ ఒకసారి ప్రయత్నించండి' అని సలహా చెప్పారు.

ఐడియా ఇచ్చినందుకు వారిని అభినందించి, కరెంటు రిజర్వేషన్ కౌంటర్‌కి వెళ్ళాను. అప్పుడే నిద్రలేచి, మొహం కడుక్కొన్నట్టుగా ఫ్రెష్‌గా ఒకామె పేపర్ చదువుతోంది.

పమ్మి శేష శ్రీనివాస్

"మేడమ్. ఈ సాయంత్రం బెంగుళూరు వెళ్ళడానికి ఏ రైలు బండిలోనైనా సెకండు క్లాసు రిజర్వేషన్లు ఉన్నాయా" – కౌంటరు చిన్ని రంధ్రంలో మొహం పెడుతూ అడిగాను.

ఇంతలో టీ బాయ్ వచ్చి, ఆడిడకి టీ ఇచ్చాడు. ఎడంచేత్తో టీ గ్లాసు పట్టుకొని కళ్ళజోడు సరిచేసుకుంటూ రెండు చుక్కలు తాగాక వక్కపొడి పొట్లం తీసింది. రెండు పలుకులు వక్క పలుకులు వేసుకొని, ఆవలిస్తూ నాకేసి చూసింది.

"మేడమ్. మీరు ఒకసారి చూసి చెబితే, నాకు చాలా ఉపయోగంగా ఉంటుంది" – చాలా వినమ్రంగా అడిగాను.

కంప్యూటర్ మీటలను టకటక లాడించి, "సాయంత్రం ఆరు గంటలకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతారా?" అని అడిగింది.

"తప్పకుండా. పడుకోవడానికి బెర్తు ఉంటుందా?" – ట్యూబ్ లైటులా మొహం వెలిగించి కొన్నాను.

"ఎన్నిసార్లు చెప్పాలి ఉందని" – కొట్టినట్టు సమాధానం.

"ఇప్పుడు నేను ఏమి చేయాలి?" – చాలా అనునయంగా అడిగాను.

"చూస్తే చదువుకున్న వాడిలా ఉన్నావు. ఆ మాత్రం తెలియదా? సాధారణ టికెట్ తీసుకొని వస్తే కరెంటు రిజర్వేషన్ బుక్ చేస్తాము. వేరే బండికున్న రిజర్వేషన్ టికెట్ ఉంటే, ఆ టికెట్ రద్దు చేసుకోవాలి – ఆ వెళ్లు" – మళ్లీ పేపరులో నిమగ్నమయి పోయిందా మహాతల్లి.

వినియోగదారుని సేవలు భారతదేశంలో మెరుగు అయ్యాయి అని విన్నాను–విని ఆనందించాను. నాకు కూడా చవిచూసే అదృష్టము ప్రసాదించమని భగవంతుని కోరుకుంటూ సాధారణ టికెట్ క్యూలో నిలబడ్డాను.

ఈ క్యూ గొంగళిపురుగులా నెమ్మదిగా కదులుతోంది. చచ్చిచెడి బెంగుళూరుకి సాధారణ టికెట్ తీసుకొనేసరికి అయిదు గంటల యాభై నిమిషాలు అయింది. బండి వచ్చే టైము అయింది. ఇంకా నేను రిజర్వేషన్ తీసుకోవాలి అని అనుకుంటూ గబాగబా రొప్పుతూ పరిగెట్టాను.

కిటికీకి ఉన్న చిన్న రంధ్రంలో చూస్తే మేడమ్ వక్కపొడి నవులుతూ వార్తాపత్రికలో జిల్లా ఎడిషన్ చదువుతోంది.

"మేడమ్. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ ఇప్పించండి" – పాధేయపడుతూ అడిగాను. సాధారణ టికెట్‌తో పాటు రెండు వందల రూపాయలు కూడా ఇచ్చాను. ఆమె నాకు కరెంటు రిజర్వేషన్ ఇచ్చి, ఇంక వెళ్లు అని కనుబొమ్మ ఎగరవేసింది. కాని రశీదు ప్రకారం రిజర్వేషన్ ఖరీదు నూట నలభై అయిదు రూపాయిలు మాత్రమే!

"మేడమ్ అయిదు రూపాయలు ఇస్తాను. అరవై రూపాయలు ఇస్తారా?"

"............"

"మేడమ్ అయిదు రూపాయలు ఇస్తాను. అరవై రూపాయలు

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

# జ్యోతి పిల్లకోతి కిచకిచలు

*(గత సంచిక తరువాయి)*

**అం**దుకే "జోకుల పోటీ" (మే,1963) అనీ, వెయ్యిన్నూట పదహార్ల (నయాపైసలు మాత్రమే సుమండీ) బహుమతి అనీ, ప్రకటించేరు. అప్పుడందరూ పెన్నూ, కాగితాలూ పట్టుకుని విన్నవీ, కన్నవీ, తెలిసినవీ, తెలియనివీ బరబరా రాసి 'జ్యోతి' వాడి గాంధీనగర్ ఆఫీసులోకి రాకెట్లలా విసిరేరు(ట).

ఓ నెల గడిచింది. జూన్ సంచిక 'తొలిమాట'లో పోటీకి మంచి జోకులు రాలేదు – అందుకని మరో నెల చూసి ఫలితాలు ప్రకటిస్తాం అని అన్నారు. వీళ్ళపని ఇలా ఉందా అని ఓ నూటపదహారు జోకులు పాతిక పేజీల్లో రాసి పోస్టు డబ్బాలో కుక్కేను – స్టాంపులు సరిగ్గా అంటించే సుమండీ!

కాంగ్రెస్ ఆఫీస్ రోడ్‌లోని 'జ్యోతి' కార్యాలయం జోకుల జడివానలో కనపడకుండా పోయిందనే వార్త గుప్పుమంది. ఇంకెందుకొచ్చిన జోకుల గొడవనుకున్నారేమో జూలై సంచికలో ఫలితాలు (?) ప్రకటించేరు. "తెలుగు జోకుకీ ఇంగ్లీషు జోకులకి తేడా వుందనీ, ఇంగ్లీషులో 'జోకు' అనే మాటకు అర్థాలు చతురోక్తి, హాస్యోక్తి అనేవి అనీ, అసలు సిసలు అచ్చం తెలుగులో 'జోకు' అనే మాటకు 'తిట్టు', 'తిట్టుట' అనె అర్థాలున్నాయనీ, ఏ ఒట్టు పెడితే ఆ ఒట్టు, కావలిస్తే శబ్దరత్నాకరం చూడండి. తెలుగు జోకు శుద్ధ తిట్టు!" అనీనూ పాఠకులకు జ్ఞానబోధ చేసేరు. అప్పుడనిపించింది పోటీ పెట్టేప్పుడే 'తెలుగు జోకుల పోటీ' అని ప్రకటిస్తే నూటపదహారు జోకులు వండకుండా

## తొలిమాట

నీలవేణి + ముగ్గురు కుమార్తెల కథ + పద్మ వ్యాస కారణం + గెలవని పందెం + హౌస్ పార్లమెంటు = 52 పేజీలు = ఢోకా లేని అయిదు చక్కని కథలు.

అంత మాత్రాన మీరు మిగతా పేజీలు చదవకుండా వదిలేయడానికి వీల్లేదు. వదిలేస్తే మీరే తరవాత నాలిక్కరుచుకుంటారు, మాకేం?

"నారద" గారు పెట్టిన "మీలో మీకు పోటీ" ఫలితాలు, కొత్త పోటీ ప్రకటన 108 — 109 పేజీలలో వున్నాయి.

"జోకుల పోటీ"కి మంచివేమీ రాలేదు. అందుచేత ఫలితాలను ఈ నెల ప్రకటించలేకపోయినందుకు చింతిస్తున్నాము. వచ్చే నెలకు ఇంకా మంచివి పంపించడానికి ప్రయత్నించమని మనవి.

ఒకటే వంటకం వండి పంపేవాడ్ని గదాని. ఆ వంటకం ఇలా వుండి వుంటుందేమో:

"నువ్వు వెధవ్వి"

"నువ్వే వెధవన్నర వెధవ్వి"

"నువ్వే కోటిన్నర వెధవ్వి"

"నువ్వే......"

"నువ్వే....."

"నువ్వే ఓ తెలుగు జోకు"

# జోకుల పోటీ

ఈ పోటీలో పాల్గొన్న వాళ్లు పంపించిన ఏ ఒక్క జోకులోనూ జోక లేదని కిందటి నెలలోనే చెప్పాం. మళ్ళా అదే ఈనెల కూడా మేము పునరుక్తి చేస్తే పోటీదారులు దానిని ఒక తెలుగు జోకు కింద తీసుకుంటారేమో అని భయపడుతున్నాం. (అన్నట్టు— తెలుగు జోకుకీ ఇంగ్లీషు జోకుకీ తేడా మీకు తెలుసనుకుంటాం. ఇంగ్లీషులో 'జోకు' అనే మాటకు అర్థాలు చతురోక్తి, హాస్యోక్తి అనేవి. అసలు సిసలు అచ్చ తెలుగులో 'జోకు' అనే మాటకు 'తిట్టు' 'తిట్టుట' అనే అర్థాలున్నాయి. ఏఒట్టు పెడితే ఆ ఒట్టు. కావలిస్తే శబ్దరత్నాకరం చూడండి. తెలుగు జోకు శుద్ధ తిట్టు!)

'జోక' అనే అకారాంతమైన మాటకు కూడా మీకు అర్థం తెలుసు. జోక అనగా అందం, బాగు, వగైరాలు. (జోకుల పోటీ రామాయణంలో ఈ అర్థాల పిడకలవేట సంపాదకుడు ఎందుకు చేస్తున్నాడా అని మీరు ఆశ్చర్య పడిపోతూ వుండవచ్చు. వచ్చిన జోకులు ఏమంత చెప్పుకోతగ్గవి కావు కనుక జోకు జోకదాల అంతరార్థాలు తీయడంవల్ల పేజీ నిండుతుందనే సదుద్దేశం తప్ప ఇంకొకటి ఎంతమాత్రం కారణం కానేకాదు.)

మేంకోరినది ఒకానొక పాత జోకు తీసుకొని దానికి కొద్దిగా మెరుగులు దిద్ది కొత్తదాన్ని చెయ్యమన్నాము. కాని, పెక్కుమంది ఈ షరతును పాటించనేలేదు. పాటించినవారు చక్కగా పాటించలేదు.

పంపిన పాత జోకులలో "మీకు మాల - అపను మాదిగా" వంటివి, "కుక్కపిల్ల, కోడిపెట్ట, కుమ్మతిమొల్ల" వంటివీ కూడా వున్నాయి.

ఒకే ఒక్క జోకు ఏకమేవా అద్వితీయం అంటూ మేం పెట్టిన షరతుకు తగ్గట్లోవుంది. అది పంపినవారికి ధన్యవాదాలు చెప్తూ వెయ్యినూట పదహారు నయాపైసలు పంపుకొంటున్నాము.

## బహుమతి పొందిన జోకు

పోలీసు : ఏయ్. సైకిలాపు.

సైకిలువాడు : దీనికి బెల్లు ఒక్కటే కాదు. బ్రేకులుకూడా లేవు.

పోలీసు : అదికాదు లేవయ్యా! నన్నుకూడా డబుల్ లోడు తీసుకుపోవయ్యా. కొంచెం పనుంది అటుపక్క.

పంపినవారు :

—కొంచాడ సోమేశ్వరరావు, (సోంపేట)

# ఉత్తరాయణం

మీ (మా) - సారీ - మా (మీ) - వెరీ సారీ, మన 'జ్యోతి' లో వస్తున్న 'మెథడుకు మేధ' 'సాహిత్యపరిచయం' 'క్విజ్' లు వంటివి చూస్తుంటే పిల్లలపత్రిక జ్ఞాపకం వస్తున్నది. అవి మానివేసి, వాటికి బదులు కార్టూన్లో, జోకులో ప్రచురిస్తే బావుంటుందని నా సలహా.

నీలవేణి, మద్రాసు.

* *

'జ్యోన్' నెల సంచికలో వేసిన "పాడిందే పాట"కు అర్థమేమిటో అవగాహన కాలేదు. కాస్త తెలిసేలా వేస్తే ధన్యులము.

కుమార్, జి. రాజమండ్రి

* *

జ్యోతికి శుభాకాంక్షలు :

ఇర్రింకి నరసింహారావు, భీమవరం

థాంక్స్. ఇప్పటికైనా మీకంటపడ్డాం.

* *

"జ్యోతి"ని ముప్పయ్యేళ్ళ లోపువాళ్లే చదవాలని నా అభిప్రాయం. మీరేమంటారు?

ఎస్. నాగేశ్వరరావు, హైదరాబాదు

ఈ మాట మీ నాన్నగారు ఒప్పుకోరేమో.

* *

ఆ చేతిలో జ్యోతి
ఈ చేతిలో జ్యోతి
అన్ని చేతులలోన
అమరియున్నది జ్యోతి

మీవాడు.

వి. వెంకటేశ్వరరావు, ఏలూరు

* *

సంపాదకులకు లేఖలు వ్రాయడం దాదాపు నాకు వృత్తిలాంటిది. నాకు కొన్ని సందేహాలున్నాయి. తీరుస్తారా ?

కె. రంగారావు, హైదరాబాదు

మావృత్తి సందేహ నివృత్తి కాదు.

* *

....జ్యోతిలో రాను రాను జోకులు తగ్గిపోతున్నాయి. మొట్టమొదట జోకినంత ఎక్కువగా జోకటంలేదు. నారదగారి పోటీ, జోకులపోటీ ఐడియా బాగున్నాయి.

ఆర్వీ సుబ్బారావు, న్యూఢిల్లీ

* *

మీ పద్ధతే నేనూ అవలంబించాను. ఎలా వుంది? ఇబ్బందిగా వుందా? అంచేత దయచేసి ఇకనుంచీ తలకిందులుగా జోకులు వగైరా అచ్చెయ్యడం మానెయ్యండి.

ఎస్. చంద్రశేఖరరావు, హైదరాబాద్

* *

నేను భోజనముందు కూర్చున్నప్పుడు సాధారణంగా ఏదైనా పేపరో, పుస్తకమో పట్టుకుని తింటూ (ఐమీన్ భోజనాన్ని) చదువుతాను. మీ సచిత్ర హాస్యపత్రిక "జ్యోతి"ని మాత్రం భోంచేస్తూ(అన్నాన్ని) చదవడం (జ్యోతిని) పక్కవాళ్ళకి ప్రమాదకరమని ఒకానొక నాటి సంఘటనతో తెలిసొచ్చింది. మరీ అంత నవ్వొచ్చే విట్లులు, కార్టూన్లు వేస్తే ఎలాగండీ ?

టి. పి. రాఘవరావు, మద్రాసు

వెయ్యకపోతే ఎలాగ ?

* *

## ఆరుద్ర పాదాలు

రసికజన వేద్యమ్మ
లారుద్ర పద్యమ్ము;
లవి స్కాచ్చి మద్యమ్ము
లో కూనలమ్మ

మొదటి మూడు పదమ్ము
లందు లోకవిధమ్ము;
ఇక నాల్గవ పదమ్ము
—ఓ కూనలమ్మ

ప్రాస అతని దగుత
బాస అతని దయిత;
ఆరుద్రదే కవిత
ఓ కూనలమ్మ

పత్రికలు, సినిమాలు
కవితావధానాలు
ఎంత ఓపిక నీకు
ఓ కూనలమ్మ !

రావి సూర్యప్రకాశరావు, విశాఖపట్నం

* *

రెండు మూళ్ళు ధరించి
రుద్ర ముద్ర ధరించి
రాయు పాటలు దంచి
ఓ కూనలమ్మ !

వి. బి. రెడ్డి, హైదరాబాద్

* *

ఒకానొక బస్టాప్ దగ్గరలో ఒక తల్లీ ఆరేళ్ళ కొడుకూ నిలబడ్డారు. వాన కురిసిన రోడ్డుమీద నూనె ఒలికింది కాబోలు రంగులు తేరి మెరుస్తోంది. కుర్రవాడు దానికేసి చూసి "అమ్మా ఇంద్రధనస్సు రోడ్డు మీద పడిపోయిందే" అన్నాడు.

పసివాడి నోట అంత గొప్ప వాక్యం విని ముగ్ధుణ్ణి అయిపోయిన నేను ఆ ఆనందం మీతో పంచుకుందికిది రాస్తున్నాను.

యడ్లపాటి శాయి, 1-9-286/3, విద్యానగర్, హైదరాబాద్

* *

మీకు తెలుసునో లేదో నేను నాలుగు నెల్లనించి మిమ్మల్ని ఒక్కలాగ అగ్నిపరీక్ష చేస్తున్నాను. చివరికి మీరే నెగ్గారు. కిందటినెల చందా కట్టేశాను. మీరు గుర్తుపట్టారా ?

ఓ....న....హో....వు

లేదు. మనియార్డరొచ్చిందని పోస్టుమాన్ చెప్పినప్పుడుకూడా కనుక్కోలేము. డబ్బు చేతికిచ్చాక గుర్తించాం. థాంక్యూ.

* *

చందా కట్టమని సూటిగా అడగడానికి మొహం చెల్లక్కాబోలు—మీరు జోకుల రూపంలో డొంకతిరుగుడుగా అడుగుతున్నారు. బాగానే వుంది. కాని అది మరీ టూమచ్ అవుతోంది. నేను ఎరువు తీసుకుని చదివే పాఠకులలో ఒకణ్ణి. కాని ఒకణ్ణే కానని మనవి.

మీరు ఓవర్‌డూ చేస్తే నేను ఎప్పుడి కూడా చదవను.

సి. హెచ్. ప్రభాకరశాస్త్రి, వైజాగ్

* *

## జానీ జోకర్

మీ పత్రికలో కొన్ని ఎర్లో జోక్సుకూడా వేస్తూవుంటే బాగుంటుంది.

వి. సత్యన్నారాయణ

* *

స్వామీ : గోపులు అన్న పేరుతో బొమ్మ వేస్తున్న వారు బాపులుగారు కాదు కదూ ?

ఎమ్. కోటేశ్వరరావు, బందరు

కారు. ఆయన తమిళనాడులో అగ్రశ్రేణి చిత్రకారులు. ప్రముఖ తమిళ వారపత్రిక "ఆనంద వికటన్" ముఖచిత్రాలు - లోపల కథలకు చిత్రాలు, కార్టూనులు అసంఖ్యాకంగా వేసినవారు; వేస్తున్నవారు. జ్యోతి ఆరంభ సంచిక ముఖచిత్రం వేసి యిచ్చిన వారు వారే.

JYOTI
ILLUSTRATED TELUGU MONTHLY
Buckinghampet P. O. VIJAYAWADA-2

శ్రీ [illegible] రావు గారికి,

నమస్కారాలు. మీకు ఉత్తరం జ్యోతి జూలై సంచిక వెలువడడానికి కొంత ముందుగానే అందవలసింది. [illegible] ప్రయాణం పడకేసిన ఆలస్యమైనది.

మీరు పంపిన జోక్స్‌లో ఒక దాన్ని కొద్దిగా మార్చి, మిగిలిన ఉత్తరాల శీర్షికలో వేస్తాము. [illegible] ఆ శీర్షికకు వచ్చే ఉత్తరాలను, రకరకాలైన వాటిని [illegible]

[illegible]

కృతజ్ఞతలతో

Yours truly,
N. Ramamohan Rao
4/7/63




"కాదు. నువ్వే తెలుగున్నర జోకువి"

ఈ ప్రహసనం ఇక్కడితో ఆగిపోతే బావుండేది.

కానీ ఆగలేదు.

ఓరోజు సంపాదక వర్గం సభ్యులు నండూరి రామమోహన రావు రాసిన ఇన్‌లాండ్ కవర్ వచ్చింది.

అదండీ సంగతి! ఆ తర్వాత మిగిలిన నూటపదహైదు జోకుల్లో చాలా తర్వాతి సంచికల్లో అక్కడక్కడక్కడా వచ్చేయి కరివేపాకు రెబ్బల్లా! భోజనంలో కరివేపాకుకు ప్రత్యేక వంటకంగా పేరుండదుగదా!

ఏదేమైనా ఒక పత్రికా సంపాదకుడు ఒక అతి చిన్న విషయం గురించి ఓ అనామక పాఠకుడికి విపులంగా ఉత్తరం రాయడం మహా గొప్పాతి గొప్ప విషయం. ఆనాటి వారి ప్రమాణాలూ, నిబద్ధతా అలాంటివి. 'సరిలేరు నీకెవ్వరూ….' అన్న పాట అప్పటి కొచ్చి ఉంటే బావుండి వుండేది.

(మరికొన్ని కిచకిచలు వచ్చే సంచికలో)



డా. కె.వి.రమణ

# నవ్వు

మనకు ఎన్నో కష్టాలుండొచ్చు. బాధలుండొచ్చు. బాధ్యతలుండొచ్చు. సమస్యలుండొచ్చు. కాని ముఖాన్ని సీరియస్‌గా వుంచుకొన్నంత మాత్రాన మన బాధలన్నీ మటుమాయం కావు. కొందర్ని చూస్తే ప్రపంచంలో వున్న చీమలన్నీ తమ ముఖం మీదే పాకుతున్నట్లు ఫీలవుతున్నట్లుగా వుంటారు. చెక్క మొహాల్లో ఏ రకమైన ఫీలింగూ కన్పడనీయకుండా జాగ్రత్త పడుతుంటారు కొందరు. లోకంలో వున్న బాధంతా తామే మోస్తున్నట్లుగా కన్పడే మొఖాలతో కొందరుంటే, విషాద చక్రవర్తి బిరుదు కోసం అర్రులు చాచే వారిలా కన్పడేవారు మరికొందరు. ఎప్పుడూ సీరియస్‌గా వుండేవారు తమ చుట్టూ ఎవర్నీ చేరనివ్వరు. ఎవ్వరైనా చేరిన వారుంటే వున్న వారిని దూరం చేసుకుంటారు. నీరసంగా, అశాంతిగా ఒంటరి జీవితం గడుపుతుంటారు – ఎడారిలో ఒంటెలా. అందుకే నవ్వుతూ బ్రతకాలి. నవ్వుతూ బ్రతకడం నేర్చుకోవాలి *(అలవర్చుకోవాలి)*. వికసించిన వదనానందంలో ప్రత్యేకమైన అందముంది. ఆకర్షణ వుంది. నవ్వుతూ మాట్లాడేవాళ్ల పట్ల అందరూ తొందరగా ఆకర్షింపబడతారు. నవ్వడం మనకు దేవుడిచ్చిన వరం; అద్భుత శక్తి; అపూర్వ ఔషధం. హాయిగా మనసారా నవ్వుకోవడం ఆరోగ్యానికి మంచి టానిక్ అని, హాస్యానికీ, ఆరోగ్యానికీ అవినాభావ సంబంధముందని అటు డాక్టర్లూ, ఇటు పెద్దలూ అనుభవపూర్వకంగా అనాదిగా చెబుతూనే వున్నారు. అందుకే ఇటీవలి కాలంలో లాఫింగ్ క్లబ్బులూ, లాఫింగ్ థెరపీలూ విస్తారంగా ప్రచారంలోకొచ్చాయి. నవ్వుతూ పిల్లల్తో మాట్లాడితే పరుగుపరుగున వచ్చి చుట్టేసుకుంటారు. కేరింతలు కొడతారు. చిరాకుగా కన్పించే వాళ్లకి, క్వశ్చన్ కార్క్ మొహాల వాళ్లకి, సీరియస్‌గా వున్నవాళ్లకి మాత్రం దూరంగా వుంటారు పిల్లలు. పిల్లలు నవ్వుతూ, తుళ్లుతూ, కేరింతలు కొడుతూ వుంటే వాళ్లని చూస్తూ తల్లిదండ్రులు సమస్త బాధల్నీ మరచిపోతుంటారు. సంతోషంగా, సంతృప్తిగా జీవించే తల్లిదండ్రుల పెంపకంలో, ప్రాపకంలో ఎంతో ఎదుగుతారు పిల్లలు. సంతోషమే సగం బలం. సంతోషంగా వున్న వారి ముఖాలు, సంతృప్తికరంగా జీవించేవారి ముఖాలు అరవిరిసిన గులాబీలు. సంతోషం, సంతృప్తీ రెండూ డబ్బిచ్చి మార్కెట్లో కొనుక్కోలేం. అరువుకు తెచ్చుకోలేం. అదనపు మాస్క్‌గా తొడుక్కోలేం. కాని జీవనవిధానంగా మలచు కోవాలి. లోకంలో బాధలు, సమస్యలు లేనివారెవ్వరు? ఎన్ని బాధలున్నా, ఎన్ని సమస్యలొచ్చినా, కష్టాలొచ్చినా, ప్రశాంత వదనంతో, స్థిరచిత్తంతో, చెరగని చిరునవ్వుతో అనుక్షణం సంతోషంతో జీవిత ప్రయాణం సాగించాలి. సాగించేలా మనసును మలచుకోవాలి *(శరీరాన్ని సాధన చేయాలి)*. ఏడ్వడం మనిషి పుట్టిన క్షణంలోనే చేస్తాడు; నవ్వుని మాత్రం సమాజం నుండి నేర్చుకొంటాడు. మనిషి సభ్య సమాజంలో మనం తోటివారిని ఏడ్పించకుండా సాధ్యమైనంత వరకు నవ్వించే ప్రయత్నం చేస్తే – అది శాంతి, సౌభాతృత్వాలకు దారి తీస్తుంది. *"నవ్వించడం ఒక కళ. "నవ్వడం ఒక భోగం; నవ్వించడం ఒక యోగం; నవ్వకపోవడం ఒక రోగం"* అని మిత్రులు, కీర్తిశేషులు హాస్యబ్రహ్మ బిరుదాంకితులు శ్రీ జంధ్యాల అన్న మాటలు అక్షర సత్యాలు. మనలో వున్న లోపాలు ఎదుటి వారికి నవ్వు తెప్పిస్తున్నప్పుడు, వారిని చూసి మనం కోపం తెచ్చుకోకుండా, మన లోపాలకు మనం కూడ నవ్వుకోగల విశాల దృక్పథం వున్నప్పుడే మనం ఎదగడానికి అవకాశముంటుంది. 'నవ్వు నాలుగు విధాల చేటు' అన్నది పాత సామెత. 'నవ్వు అన్నివిధాల మేల'న్నది నేటి నానుడి. నవ్వుల్లో నానా రకాలు.

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*